క్లుప్తంగా

ధాన్యం తరలి.. రాళ్లు మిగిలే



రాళ్లతో నిండిపోయిన క్రీడా మైదానం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చంద్లాపూర్ తెలంగాణ క్రీడాప్రాంగణంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కేంద్రానికి తెచ్చిన ధాన్యాన్ని టార్పాలిన్ కవర్లపై రాశులుగా పోశారు. కవర్లు గాలికి పైకి లేవకుండా రాళ్లను పెట్టారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించి కవర్లను తీసుకెళ్లారు. రాళ్లను మైదానంలోనే వదిలేశారు. దీంతో క్రీడా మైదానం మొత్తం రాళ్లతో నిండిపోయింది.

దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్‌రూరల్: బాలుర డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్ సబ్జెక్టు బోధించేందుకు అతిథి అధ్యాపకుల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గజ్వేల్ ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంబంధిత సబ్జెక్టులో ఎస్సీ, ఎస్టీలైతే 50 శాతం, ఓసీ, బీసీలైతే 55 శాతంతో పీజీ పూర్తి చేసినవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా నెట్ లేదా సెట్ పాసైన వారికి, పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 7వ తేదీ ఉదయం 11 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని, డెమో క్లాసుల ద్వారా ఎంపిక ఉంటుందన్నారు. అర్హతగల అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువపత్రాలతో పాటు ఒక సెట్ జిరాక్స్ తో రావాలని సూచించారు.

రఘునందన్‌రావుకు బొప్పాపూర్ అండ

దుబ్బాక: మెదక్ ఎంపీగా గెలుపొందిన మాధవనేని రఘునందన్‌రావుకు తన స్వగ్రామం దుబ్బాక ఉమ్మడి మండలంలోని బొప్పాపూర్ అండగా నిలిచింది. బొప్పాపూర్‌లో బీజేపీకి 339 ఓట్లు రాగా బీఆర్‌ఎస్‌కు 185, కాంగ్రెస్‌కు 38 ఓట్లు వచ్చాయి. రఘునందన్‌రావుకు స్వగ్రామంలో 154 ఓట్ల మెజార్టీ వచ్చింది. ఇక దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి స్వగ్రామం పోతారంలో బీఆర్‌ఎస్‌కు 386 ఓట్లు, బీజేపీకి 291, కాంగ్రెస్‌కు 91 ఓట్లు వచ్చాయి. ఎమ్మెల్యేకు స్వగ్రామంలో 75 ఓట్ల మెజార్టీ వచ్చింది. అలాగే కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గం ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి స్వగ్రామం తొగుట మండలం తుక్కాపూర్‌లో కాంగ్రెస్‌కు 436 ఓట్లు, బీఆర్‌ఎస్ 150, బీజేపీకి 199 ఓట్లు వచ్చాయి.

డంపింగ్ యార్డు పరిశీలన



అధికారులకు సూచనలు చేస్తున్న వరంగల్ రీజినల్ డైరెక్టర్ షాహెద్ మసూద్

గజ్వేల్‌రూరల్: పట్టణ శివారులోని డంపింగ్ యార్డును వరంగల్ రీజినల్ డైరెక్టర్ షాహెద్ మసూద్ మంగళవారం పరిశీలించారు. డంపింగ్‌యార్డులోని బయోమైనింగ్‌లో జరిగే రీసైక్లింగ్ పనులతో పాటు కంపోస్ట్ ఎరువు తయారీని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, ఏఈఈ కిష్టన్న, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బావిలో పడిన వ్యక్తిని రక్షించిన గ్రామస్తులు



108లోకి ఎక్కిస్తున్న గ్రామస్తులు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని వల్లంపట్ల గ్రామంలో బైరాన్‌పల్లి గ్రామానికి చెందిన వ్యక్తి ప్రమాదవశాత్తు బైక్‌తోపాటు సోమవారం అర్ధరాత్రి బావిలో పడ్డాడు. బావిలో ఉండి కేకలు వేయడంతో అటుగా వెళ్తున్న పలువురు గమనించి నిచ్చెన్న సాయంతో అతడిని బావిలో నుంచి బయటికి తీశారు. గణేష్‌కు స్వల్ప గాయాలు కావడంతో 108 వాహనంలో చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నేడు ఎస్పీ బాలు జయంతి

సిద్దిపేటజోన్: ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 78వ జయంతిని బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నామని సిద్దిపేట ఈవెంట్స్ మేనేజర్స్ అసోసియేషన్ ఒక ప్రకటనలో తెలిపారు. కోమటిచెరువు యోగా కేంద్రంలో బుధవారం సాయంత్రం 6 గంటలకు జయంతి వేడుకలు ప్రారంభిస్తామన్నారు. సిద్దిపేట గాయనీ గాయకులతో స్వర నీరాజనంతో నివాళి అర్పిస్తామన్నారు.

హుస్నాబాద్‌లో బీజేపీ హవా

- మెజార్టీ రికార్డుతో బండి సంచలనం
- హుస్నాబాద్ సెగ్మెంట్‌లో కాంగ్రెస్‌కు ఆధిక్యం
- సొంత నియోజకవర్గంలో పట్టు నిలుపుకున్న పొన్నం



విజయ సంకేతం చూపుతున్న బండి సంజయ్

హుస్నాబాద్: కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ భారీ మెజార్టీతో విజయఢంకా మోగించారు. పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాల్లో హుస్నాబాద్ మినహా మిగితా నియోజకవర్గాల్లో ఆయన మెజార్టీ ఓట్లు సాధించారు. కరీంనగర్ ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో మంగళవారం కౌంటింగ్ నిర్వహించారు. హుస్నాబాద్ నియోజకవర్గం పరిధిలో 22 రౌండ్లు నిర్వహించారు. ప్రతీరౌండ్‌లోను కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు ఆధిక్యతను ప్రదర్శించారు. కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ మొదటి స్థానంలో నిలవగా, కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు రెండవ స్థానం, బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ మూడో స్థానంలో నిలిచారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏ రౌండ్‌లోనూ ఆధిక్యత కనబర్చలేదు. హుస్నాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి 79001 ఓట్లు, బీఆర్‌ఎస్ అభ్యర్థి 42298 ఓట్లు, బీజేపీ అభ్యర్థి 55873 ఓట్లు సాధించారు.

గత శాసన సభ ఎన్నికల ఫలితాలు

2023 శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ 99769 ఓట్లు , బీజేపీ అభ్యర్థి బొమ్మ శ్రీరాం చక్రవర్తి 8228 ఓట్లు, బీఆర్‌ఎస్ అభ్యర్థి సతీష్‌కుమార్ 81292 ఓట్లు సాధించారు. బీజేపీ అభ్యర్థికి డిపాజిట్ దక్కలేదు. బీఆర్‌ఎస్ అభ్యర్థి సతీష్‌కుమార్‌పై 19344 ఓట్ల మెజార్టీతో పొన్నం విజయం సాధించారు. శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి 19344 ఓట్ల మెజార్టీ ఓట్లు రాగా, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాజేందర్ రావు 23128 ఓట్ల మెజార్టీ సాధించారు. హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన పొన్నం ప్రభాకర్ మంత్రి కావడం, ఎంపీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తే ఆరు గ్యారెంటీలతో పాటుగా నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి సాధించవచ్చని ప్రజలకు భరోసా ఇవ్వడంతో కాంగ్రెస్ అభ్యర్థికి అత్యధికంగా ఓట్లు వేశారు. అలాగే 2023 హుస్నాబాద్ శాసనసభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బొమ్మ శ్రీరాంచక్రవర్తి 8228 ఓట్లు రావడంతో డిపాజిట్ కోల్పోయాడు. పార్లమెంట్ ఎన్నికల పరంగా హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ 55873 ఓట్లను సాధించి ఔరా అనిపించాడు.

ఆల్ టైం రికార్డు

2024 కరీంనగర్ పార్లమెంట్‌లో బండి సంజయ్ ఆల్ టైం రికార్డును సాధించాడు. గతంలో కేసీఆర్, వినోద్‌కుమార్ పేరిట ఉన్న అత్యధిక రికార్డును బండి సంజయ్ బ్రేక్ చేశాడు. 2006 ఉప ఎన్నికల్లో కేసీఆర్ 2,01,582 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించాడు. 2014లో బోయినపల్లి వినోద్‌కుమార్ 2,05,007 ఓట్లు మెజార్టీ సాధించాడు. కరీంనగర్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ రెండోసారి విజయం సాధించాడు. బీజేపీ అభ్యర్థికి 5,85,116 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావుకు 3,59,907 ఓట్లు, బీఆర్‌ఎస్ అభ్యర్థి బొయినపల్లి వినోద్‌కుమార్‌కు 2,82,163 ఓట్లు వచ్చాయి. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో 2,25,209 ఓట్ల మెజార్టీతో బండి సంజయ్ రికార్డు బ్రేక్‌ను బద్దలు కొట్టి సంచలనం సృష్టించాడు.

ఆరోగ్యంతోనే లక్ష్యాన్ని చేరుకోగలం



ఫైరింగ్‌లో శిక్షణ పొందుతున్న క్యాడెట్లు

డాక్టర్ పద్మజ్యోతి

గజ్వేల్‌రూరల్: ఆరోగ్యంగా ఉన్నప్పుడే లక్ష్యాన్ని సులువుగా చేరుకోగలమని స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ ఆర్.పద్మజ్యోతి సూచించారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో సంగారెడ్డి బెటాలియన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎన్‌సీసీ సంయుక్త శిబిరాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీలో చేరిన విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. మహిళల్లో వచ్చే శారీరక సమస్యలను అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఏదైనా సమస్య తలెత్తినా, అనారోగ్యానికి గురైనా వెంటనే తగిన పరిష్కార మార్గాలను ఎంచుకోవాలన్నారు. శిక్షణలో భాగంగా గజ్వేల్ అగ్నిమాపక అధికారి సురేష్ కుమార్ అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఇదిలా ఉంటే రాజగోపాల్‌పేట ఫైరింగ్ రేంజ్ వద్ద ఎన్‌సీసీ క్యాడెట్లు ఫైరింగ్‌లో శిక్షణ పొందినట్లు ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ యాదగిరి, క్యాంప్ డిప్యూటీ కమాండెంట్ కెప్టెన్ డాక్టర్ భవానీలు తెలిపారు.

మహిళలు స్వయం ఉపాధి పొందాలి



మహిళలకు సూచనలు చేస్తున్న పీడీ జయదేవ్

హుస్నాబాద్‌రూరల్: గ్రామీణ మహిళలు కుట్టు శిక్షణ తో స్వయం ఉపాధి పొందాలని డీఆర్‌డీఏ పీడీ జయదేవ్ ఆర్య అన్నారు. మంగళవారం హుస్నాబాద్‌లో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉన్నతి కార్యక్రమంలో మహిళలకు ఇస్తున్న మగ్గం వర్కు శిక్షణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు స్వశక్తి సంఘాల్లో చేరి ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారని, స్వయం ఉపాధితో అదనపు ఆదాయం పొందొచ్చన్నారు. మహిళలకు ఉపాధి కల్పించడానికి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల దుస్తుల కుట్టు పనిని కూడా మహిళా సంఘాలకు అప్పగించామన్నారు. పోతారం (ఎస్) లో స్త్రీ శక్తి టైలరింగ్ యూనిట్ మహిళలు కట్టు పనితో ఉపాధి పొందుతూ గ్రామీణ మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో డీపీఎం కరుణాకర్, ఏపీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

సిద్దిపేటలో పోటాపోటీ



ఈవీఎంలో పార్టీల ఓట్లను పరిశీస్తున్న సిబ్బంది

- ప్రతీ రౌండ్‌లో ఉత్కంఠ
- నియోజకవర్గంలో 2673 ఆధిక్యం
- నోటా ఖాతాలో 648

సిద్దిపేటజోన్: మెదక్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని సిద్దిపేట నియోజకవర్గ పరిధి ఓట్ల లెక్కింపు బీఆర్‌ఎస్, బీజేపీల మధ్య నువ్వా.. నేనా అనే తరహాలో ఉత్కంఠగా సాగింది. మొత్తం 20 రౌండ్లకు గాను 12 రౌండ్లలో బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి ఆధిపత్యం కొనసాగించారు. మిగతా ఎనిమిది రౌండ్లలో బీజేపీ ఆధిక్యం సాధించగా మొత్తంగా బీఆర్‌ఎస్ అభ్యర్థి నియోజకవర్గంలో సమీప బీజేపీ అభ్యర్థి రఘునందన్ మీద 2,673 ఓట్ల ఆధిక్యత సాధించారు. నియోజకవర్గ పరిధిలోని 2,37,511 ఓటర్లకు గాను మే 13వ తేదీన జరిగిన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌లో 1,74,969 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల షెడ్యూల్‌లో భాగంగా మంగళవారం నర్సాపూర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు నిర్వహించారు. మొత్తంగా 20 రౌండ్లలో లెక్కింపు జరగగా ప్రతీరౌండ్‌లో బీఆర్‌ఎస్, బీజేపీ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. మొదటి నాలుగు రౌండ్లలో బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి ఆధిక్యం లభించింది. తర్వాత ఐదవ రౌండ్ నుంచి 12వ రౌండ్ వరకు బీజేపీ అభ్యర్థి ఆధిక్యం కొనసాగింది. తర్వాత రౌండ్ల నుంచి నియోజకవర్గ ఓట్ల లెక్కింపు వరకు బీఆర్‌ఎస్ అభ్యర్థి హవా కొనసాగింది. మొత్తం రౌండ్లలో బీఆర్‌ఎస్ అభ్యర్థికి పోస్టల్ ఓట్లు కలిపి 65501 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థికి 62828 ఓట్లు వచ్చాయి. ఇక కాంగ్రెస్ అభ్యర్థి మధు 33174 ఓట్లతో నియోజకవర్గంలో మూడో స్థానంలో నిలిచారు. నోటా కింద 648 ఓట్లు పోలవడం విశేషం. గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన నియోజకవర్గ ఎమ్మెల్యే ఫలితాలను పరిశీలిస్తే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మెరుగైన ఫలితాలు సాధించాయి. అప్పట్లో 1,78,420 ఓట్లు పోల్ అవ్వగా బీఆర్‌ఎస్ అభ్యర్థి హరీశ్‌రావుకు 1,05,514 ఓట్లు, బీజేపీకి 23,201 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థికి 23,206 ఓట్లు వచ్చాయి. రెండు ఎన్నికల్లో పోలింగ్ శాతం ఇంచుమించు సమీపంలో ఉన్నపటికీ పార్టీలు సాధించిన ఓట్లలో తేడా కన్పించింది. మొత్తంగా నియోజకవర్గంలో బీఆర్‌ఎస్, బీజేపీలు పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో గట్టిగా పోటీ పడ్డాయి. కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్యే ఎన్నికల ఫలితాలతో పోల్చితే ఇప్పుడు స్వల్ప ఆధిక్యం లభించింది.

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు



సంబురాల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

చేర్యాల(సిద్దిపేట): భువనగిరి ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలవడంతో పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు, యువ నాయకుడు కొమ్మూరి రాకేష్‌రెడ్డి ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పెరిగిన టోల్ చార్జీలు

తూప్రాన్: పట్టణ శివారులోని 44వ జాతీయ రహదారిపై ఉన్న టోల్ ప్లాజాలో వాహనాల టోల్ చార్జీలు 10 శాతం పెంచుతూ ఎన్‌హెచ్‌ఎఐ సోమవారం నుంచి అమల్లోకి తెచ్చింది. ప్రతీ సంవత్సరం ఏప్రిల్‌లో టోల్ చార్జీలు పెంచుతూ వస్తుంది. కానీ ప్రస్తుత లోకసభ ఎన్నికల నేపథ్యంలో వాయిదా వేసిన అధికారులు ఎన్నికలు పూర్తి కావడంతో సోమవారం నుంచి 10 శాతం ధరలు పెంచుతూ నిర్ణయించడంతో అమల్లోకి వచ్చాయి. పెరిగిన టోల్ ధరలతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దుబ్బాకలో ఎదురుదెబ్బ

దుబ్బాక: మెదక్ ఎంపీగా విజయం సాధించిన బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు సొంత నియోజకవర్గం దుబ్బాకలో ఎదురు దెబ్బ తగిలింది. అండగా నిలుస్తుందనుకున్న దుబ్బాక నియోజకవర్గంలో 16 వేలకు పై చిలుకు ఓట్లు బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి ఎక్కువ రావడం ఆశ్చర్యం కలిగించింది. మొత్తం మెదక్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో అత్యధికంగా బీఆర్‌ఎస్‌కు మెజార్టీ ఇచ్చింది దుబ్బాక నియోజకవర్గమే. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డికి 53,512 వేల ఓట్ల మెజార్టీ రాగా పార్లమెంట్ ఎన్నికల్లో 38 వేలపై చిలుకు ఓట్లు తగ్గి కేవలం 16 వేల పై మెజార్టీ వచ్చింది. కాగా సొంత నియోజకవర్గం పై ఆశలు పెట్టుకున్న రఘునందన్ రావుకు ఆశించినంతగా ఓట్లు పడకపోవడం గమనార్హం. అన్ని నియోజకవర్గాల్లో కంటే దుబ్బాక నియోజకవర్గంలోనే భారీ మెజార్టీ వస్తుందని మొదటి నుంచి పార్టీ నాయకులు లెక్కలు వేసుకున్నారు. రఘునందన్ రావు సైతం దుబ్బాక నుంచి కనీసం 30 వేల మెజార్టీ వస్తుందనుకుంటే, 16 వేలు బీఆర్‌ఎస్ కంటే తక్కువ రావడం చర్చనీయమైంది.

ధాన్యం తడిసిపోయిందని వెనక్కి..

రైతుల నిరసన



ధాన్యం డీసీఎం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): కొనుగోలు కేంద్రం నుంచి తూకం వేసి రైస్‌మిల్లుకు తరలించిన ధాన్యం తిరిగి పంపించడంపై రైతులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని పెద్దగొట్టిముక్లలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి రైతులు తెచ్చిన ధాన్యం తూకం వేసి డీసీఎంలో రైస్‌మిల్లుకు తరలించారు. అనంతరం ధాన్యం తడిసిపోయాయని తిరిగి పంపించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సకాలంలో ధాన్యం తరలింపు చేపట్టకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని రైతులు నర్సింలు, మల్లేశ్, భిక్షపతి, రమేశ్, నవీన్ ఆరోపించారు. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం అమ్మకం కోసం ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని వారు వాపోయారు. ఈ విషయం పీఏసీఎస్ సీఈఓ మధు దృష్టికి తీసుకెళ్లగా తూకం అనంతరం కొనుగోలు కేంద్రం వద్ద వర్షం రావడంతో ధాన్యం తడిపోయిందని, రైస్‌మిల్లు యాజమాన్యంతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు.

కమలదళం సంబురాలు



బెజ్జంకిలో సంబురాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు



జగదేవ్‌పూర్‌లో ..



గజ్వేల్‌లో..



మిరుదొడ్డిలో ..



రాఘవాపూర్‌లో ..

దుబ్బాకటౌన్: మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు గెలుపొందడంతో మంగళవారం దుబ్బాక పట్టణంలో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. బాణాసంచా కాల్చి స్వీట్లు పంచారు. అనంతరం బీజేపీ దుబ్బాక మున్సిపల్ అధ్యక్షుడు సుభాష్ రెడ్డి మాట్లాడుతూ మెదక్ ఎంపీగా రఘునందన్‌రావు గెలుపొందడానికి కృషి చేసిన కార్యకర్తలకు, నాయకులకు, ప్రజ లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రవీణ్ కుమార్, నేహాల్ గౌడ్, కిషన్, రవీందర్, రమణరెడ్డి, రమేష్‌రెడ్డి, గణేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బెజ్జంకిలో..

బెజ్జంకి(సిద్దిపేట): కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ రెండు లక్షల మెజార్టీతో గెలిచినందుకు బీజేపీ మండల నాయకులు మంగళవారం బెజ్జంకిలో సంబురాలు జరుపుకున్నారు. ర్యాలీ తీసి బాణాసంచ కాల్చారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొలిపాక రాజు, సంగ రవి, రామచంద్రం, శంకర్, కిషన్, సునిత, లావణ్య, నరేష్, టీడీపీ మండల అధ్యక్షుడు నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్‌లో..

జగదేవ్‌పూర్(గజ్వేల్): మెదక్ ఎంపీగా రఘునందన్‌రావు భారీ మెజార్టీతో గెలుపొందడంతో మంగళవారం ఆ పార్టీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. గాంధీ, అంబేద్కర్ చౌరస్తాల్లో టపాసులు కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు ఐలయ్య యాదవ్ మాట్లాడుతూ మెదక్ ఎంపీగా రఘునందన్‌రావును గెలిపించినందుకు మెదక్ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తీగుల్, మునిగడప, చాట్లపల్లి తదితర గ్రామాల్లో బీజేపీ శ్రేణులు టపాసులు కాల్చి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కృష్ణమూర్తి, మల్లేశం పాల్గొ న్నారు.

గజ్వేల్‌లో..

గజ్వేల్‌రూరల్: మెదక్ ఎంపీగా బీజేపీ అభ్యర్థి గెలుపొందడంపై ఆ పార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ చౌరస్తా వద్ద, గజ్వేల్‌లో బాణాసంచా కాల్చి సందడి చేశారు. అదే విధంగా దేశంలో మోదీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావడంపై హర్షం వ్యక్తం చేస్తూ మిఠాయి పంచిపెట్టారు. అదే విధంగా నరేంద్రమోదీ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని హర్షం వ్యక్తం చేస్తూ రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు సబ్బు బిళ్లపై మోదీ బొమ్మ చిత్రించారు.

బీజేపీ ర్యాలీ

మిరుదొడ్డి(దుబ్బాక): మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు విజయకేతనంతో మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలో బీజేపీ నాయకులు మంగళవారం సంబురాలు జరుపుకున్నారు. బాణాసంచా కాల్చి ర్యాలీ తీశారు. స్వీట్లు పంచిపెట్టారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ జిల్లా నాయకులు మొగుళ్ళ మల్లేశం, మద్దెల రోశయ్య, ఎల్ములదేవరాజు, నక్క రాములు, సదానందం, ఎల్లం, స్వామి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



కుకునూరుపల్లిలో బీజేపీ ర్యాలీ

సిద్దిపేటరూరల్ మండలాల పరిధిలో..

సిద్దిపేటరూరల్: ఉమ్మడి మెదక్ పార్లమెంట్ సభ్యుడిగా బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు గెలుపొందడంతో మంగళవారం నారాయణరావుపేట, సిద్దిపేటరూరల్ మండలాల పరిధిలో ఆ పార్టీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలు మరోసారి నరేంద్ర మోదీకి అవకాశం కల్పించారన్నారు.

కుకునూరుపల్లిలో..

కొండపాక(గజ్వేల్): 37 వేల పైచిలుకు మెజారిటీతో బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు గెలుపొందడంతో కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో ఆపార్టీ శ్రేణులు మంగళవారం రాత్రి ర్యాలీలు తీశారు. ర్యాలీలో నృత్యాలు చేస్తూ మోదీ నాయకత్వం వర్ధిలాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990